క్లుప్తంగా

ఏసీ స్టేడియంలో బెంచీల ఏర్పాటు



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆరు సిమెంట్ బెంచీలను వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కేఎంకే రెడ్డి, హరిరావు సౌజన్యంతో ఏర్పాటు చేశారు. స్టేడియంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి జయదేవ్, వ్యవస్థాపకుడు మేకల నరేంద్ర రెడ్డి, డాక్టర్ అంకిరెడ్డి, నారాయణరావు, ప్రసాద్, గోపీనాథ్, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు

స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా జరపాలి

నెల్లూరు(దర్గామిట్ట): స్వాతంత్య్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్‌చార్జి జేసీ, కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. స్వాతంత్య్ర దినోత్సవ ఏర్పాట్లపై కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌ను ముస్తాబు చేయాలని కోరారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఏర్పాటు చేసే శకటాల ప్రదర్శన వినూత్నంగా ఉండాలని పేర్కొన్నారు. డీఆర్వో లవన్న, ఏఎస్పీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో ఎస్సెమ్సీ ఎన్నికలు

నెల్లూరు (టౌన్): స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. పాఠశాల చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యుల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్‌ను గురువారం ఉదయం పది గంటలకు విడుదల చేయనున్నారు. ఓటర్ల తుది జాబితాను ఈ నెల ఐదున ప్రకటించి.. ఎనిమిదో తేదీ ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట మధ్యలో ఎన్నికను నిర్వహించాలి. ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారాన్ని మధ్యాహ్నం మూడు నుంచి నాలుగు గంటల మధ్యలో చేయించి.. తొలి సమావేశాన్ని ఏర్పాటు చేయాలి. నిబంధనల మేరకు స్కూల్ మేనేజ్‌మెంట్ ఎన్నికలను సజావుగా నిర్వహించాలని డీఈఓ రామారావు, ఏపీసీ ఉషారాణి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు.

కుష్టు సర్వేను పక్కాగా నిర్వహించాలి

పొదలకూరు : కుష్టు వ్యాధి బాధితుల గుర్తింపుపై నిర్వహిస్తున్న సర్వే పక్కాగా ఉండాలని జిల్లా న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేంద్రబాబు అన్నారు. నామమాత్రపు సర్వే చేస్తే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని విరువూరు గ్రామంలో కుష్టు సర్వేను సురేంద్రబాబు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలోని అన్ని దేశాల కంటే భారత్‌లో 50 శాతం కుష్టు వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు తెలిపారు. ప్రతి ఇంటిని ఆశా కార్యకర్త సందర్శించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అనుమానిత మచ్చలు ఉంటే ప్రాథమిక వైద్యాధికారికి సమాచారం అందజేయాల్సిందిగా సూచించారు. అనుమానిత కేసుల సంఖ్యను నమోదు చేయాల్సిందిగా సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట డిప్యూటీ పారామెడికల్ అధికారి ఎం.మోహన్‌రావు, ఆరోగ్య పర్యవేక్షకులు నరసమ్మ తదితరులు ఉన్నారు.

రేపట్నుంచి రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు

ఇందుకూరుపేట : రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలు ఇందుకూరుపేట ఎంకేఆర్ క్రీడా మైదానంలో శుక్రవారం ప్రారంభమవుతాయని పోటీల నిర్వాహక అధ్యక్షుడు పముజుల రవి, కార్యదర్శి దాసరి విజయ్‌కుమార్ తెలిపారు. ఈ క్రమంలో ఏర్పాట్లను వారు బుధవారం పరిశీలించారు. జిల్లా పురుషులు, మహిళల జట్లకు క్రీడా దుస్తులను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పముజుల శ్రీనివాసులు, మహాలక్ష్మి స్మారక 11వ రాష్ట్రస్థాయి బీచ్ కబడ్డీ పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి సహకారంతో దువ్వూరు కల్యాణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పోటీలు జరుగుతాయన్నారు. అన్ని జిల్లాల పురుషులు, మహిళా క్రీడాకారులకు వేర్వేరుగా సదుపాయాలను సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చెంచు కిశోర్ బాబు, రమేష్‌నాయుడు, పవన్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, గోపాల్, చంద్రమోహన్‌రెడ్డి, మధురెడ్డి, ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.

టీబీపై అప్రమత్తత అవసరం

కొడవలూరు : లెప్రసీ(కుష్టు), టీబీ(క్షయ)పై ప్రతి ఒక్కరికీ అప్రమత్తత అవసరమని హెల్త్ అసిస్టెంట్ సుధాకర్ సూచించారు. కొడవలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.రామకృష్ణ ఆదేశాల మేరకు మండలంలోని తలమంచిలో లెప్రసీ, టీబీలపై సర్వేను బుధవారం నిర్వహించారు.

అధికారులూ.. ఓ లుక్కేయండి

అధ్వానంగా పారిశుధ్యం



టిడ్కో గృహ సముదాయాల వద్ద పేరుకుపోయిన మురుగు

నెల్లూరు(బారకాసు): నగరంలోని 54వ డివిజన్లో గల జనార్దన్‌రెడ్డి కాలనీ టిడ్కో గృహ సముదాయాల వద్ద పారిశుధ్యం అధ్వానంగా మారింది. వర్షపునీరు.. ఇళ్ల నుంచి వస్తున్న వ్యర్థ నీరు నిల్వ ఉంటోంది. దీంతో దోమలు ఉధృతమవుతూ ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. టిడ్కో సముదాయంలోని 10, 15, 20 బ్లాక్‌లలో తాగునీరు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని, పారిశుధ్యం దయనీయంగా మారడంతో పందులు సంచరిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రోడ్లు గుంతలమయం

నెల్లూరు(క్రైమ్): నగరంలోని మద్రాస్ బస్టాండ్, కస్తూరిదేవి స్కూల్ ఎదురుగా గల ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. ఈ మార్గం మీదుగా రాకపోకలు సాగించే వాహనచోదకులు ఏ మాత్రం ఏమరుపాటుగా వ్యవహరించినా ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉంది. ఇప్పటికే పలువురు పడి గాయపడ్డారు. రోడ్డును బాగు చేసేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



కస్తూరిదేవి స్కూల్ సమీపంలో ఇలా..



ఏసీ కూరగాయల మార్కెట్ వద్ద రహదారి దుస్థితి

ఆలయ పాలకమండలి ప్రమాణ స్వీకారం



నెల్లూరు(బృందావనం): స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన నూతన పాలకమండలి ప్రమాణస్వీకారాన్ని అర్బన్ ఆర్యవైశ్య సంఘ నేతలు ప్రవీణ్ శంకర్, కోట సత్యం, సోమిశెట్టి రమేష్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గౌరవాధ్యక్షుడిగా కొండా ప్రవీణ్‌శంకర్, సలహాదారుడిగా శేగు షణ్ముఖరావు, అధ్యక్షుడిగా కోట గురుబ్రహ్మం, ఉపాధ్యక్షుడిగా వేమూరు వెంకటప్రసాద్, కార్యదర్శిగా చిరంజీవి, సహాయ కార్యదర్శిగా మునగా వెంకటేశ్వర్లు, కోశాధికారిగా జనార్దన్ రావు, తొమ్మిది మంది కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. కాగా ప్రమాణ స్వీకారానికి సంబంధించి పలు అభ్యంతరాలున్న నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పెద్ద ఎత్తున బందోబస్తును ఏర్పాటు చేశారు.

ప్రణాళికబద్ధంగా భవన నిర్మాణాలు



హాజరైన అధికారులు



మాట్లాడుతున్న సూర్యతేజ

• కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పరిధిలో నూతన భవన నిర్మాణాలు ప్రణాళికబద్ధంగా జరిగేలా పర్యవేక్షించాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో టౌన్ ప్లానింగ్ విభాగాధికారులు, సచివాలయ వార్డు ప్లానింగ్ కార్యదర్శులతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. భవన నిర్మాణ అనుమతుల కోసం యజమానులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న అనంతరం సచివాలయ పరిధిలోని కార్యదర్శులు క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించి వివరాలను నమోదు చేయాలని సూచించారు. నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని పేర్కొన్నారు. ప్లాన్ మంజూరుకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలను సమర్పించకపోయినా.. ఇతర ప్రమాణాలను పాటించకపోయినా భవన యజమానికి వివరణ అందించి పూర్తి వివరాలతో తిరిగి దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. సిటీ ప్లానర్ దేవీకుమారి, టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ దశయ్య, సూపరింటెండెంట్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్ల పనుల పరిశీలన

నగరంలోని పలు ప్రాంతాల్లో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ పనులను కమిషనర్ సూర్యతేజ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అన్న క్యాంటీన్ల పనులను ఆగస్టు 15 నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఇంజినీరింగ్ ఎస్ఈ సంపత్‌కుమార్, ఈఈ సంజయ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ నేడు

నగరపాలక సంస్థ పరిధిలోని 54 డివిజన్లలో 46,963 మంది లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను గురువారం పంపిణీ చేసేలా చర్యలు చేపట్టామని కమిషనర్ సూర్యతేజ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని 166 వార్డు సచివాలయాల పరిధిలో గల లబ్ధిదారులకు దాదాపు రూ.20.06 కోట్లను వారి ఇళ్ల వద్దే వార్డు సచివాలయ కార్యదర్శుల ద్వారా అందించేలా చర్యలు చేపట్టామని వివరించారు. పర్యవేక్షణకు గానూ 27 మంది నోడల్ అధికారులను నియమించామని వెల్లడించారు. ఉదయం ఆరు నుంచే పంపిణీని ప్రారంభించి.. వివరాలను ప్రతి గంటకూ నగరపాలక సంస్థకు తెలియజేయాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి వినతి

నెల్లూరు(అర్బన్): బుజబుజనెల్లూరులో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ నేతలు కోరారు. ఈ మేరకు 2 / 25 వార్డు సచివాలయ అడ్మిన్‌కు వినతిపత్రాన్ని బుధవారం అందజేసిన అనంతరం సంఘ నేత కొండా ప్రసాద్ మాట్లాడారు. ఇక్కడి పలు కాలనీల్లో కాలువల్లేక రోడ్లపై మురుగు ప్రవహిస్తోందని చెప్పారు. కాలువలను నిర్మించడంతో పాటు దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని కోరారు. డీవైఎఫ్ఐ రూరల్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, విజయకుమార్, ఫిరోజ్, రాఘవ, కరిముల్లా, పుల్లయ్య, తిరుపాల్, శాఖ కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు.



వినతిపత్రమిస్తున్న డీవైఎఫ్ఐ నేతలు

‘ప్రియదర్శిని’లో అధికారుల విచారణ

నెల్లూరు సిటీ: కనుపర్తిపాడు సమీపంలోని ప్రియదర్శిని ఇంజనీరింగ్ కళాశాలలో తనిఖీలను జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి వెంకటయ్య బుధవారం చేపట్టారు. జ్ఞానభూమిలో విద్యార్థుల జాబితాను పరిశీలించారు. ప్రిన్సిపల్ రమేష్, ఏఓ హరేంద్ర రెడ్డి, సిస్టమ్ అడ్మిన్ యానాదయ్య తదితరులు పాల్గొన్నారు.



రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన

నెల్లూరు సిటీ: రూరల్ పరిధిలోని 12వ డివిజన్లో గల చింతారెడ్డిపాళెంలో రూ.50 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయిన్ల పనులకు శంకుస్థాపనను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి బుధవారం చేపట్టారు. నేతలు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, దొడ్డపనేని రాజానాయుడు తదితరులు పాల్గొన్నారు.



కృష్ణకిశోర్‌కు నివాళి



నెల్లూరు(బృందావనం): జన విజ్ఞాన వేదిక వ్యవస్థాపకుడు జంపా కృష్ణకిశోర్ నిత్య శాస్త్ర విజ్ఞాన ప్రచారకుడని పలువురు కొనియాడారు. నగరంలోని పొగతోటలో ఆయన సంస్మరణ సభను బుధవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. డాక్టర్ బాలకోటేశ్వరరావు, జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేణుగోపాల్, చక్రపాణి, రాష్ట్ర నేతలు శ్రీనివాసులు, కృష్ణ, శివపార్వతి, శేషు, క్రాంతి, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈఈల బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నెల్లూరు టౌన్, రూరల్ ఏఈలుగా శ్రీధర్, సోమశేఖర్‌రెడ్డి బాధ్యతలను బుధవారం స్వీకరించారు. విద్యుత్ భవన్‌లోని తమ చాంబర్లలో బాధ్యతలను చేపట్టారు. వీరికి విద్యుత్ అధికారులు తదితరులు శుభాకాంక్షలను తెలియజేశారు.

జనసేన నేతల సంబరాలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు మిలియన్ మార్కును పూర్తి చేసుకుందని పార్టీ నెల్లూరు నగరాధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు పేర్కొన్నారు. ఏసీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో కేక్‌ను బుధవారం కట్ చేశారు. నగర ప్రధాన కార్యదర్శి అజయ్‌బాబు, డివిజన్ ఇన్‌చార్జీలు సురేష్, శ్యామ్, పవన్, షకీర్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరికి శాకంబరి అలంకారం రేపు

నెల్లూరు(బృందావనం): ఆషాఢ మాస శుక్రవారాన్ని పురస్కరించుకొని స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారు శాకంబరిగా దర్శనమివ్వనున్నారని వాసవీ క్లబ్ నెల్లూరు సిటీ కార్యవర్గ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులు విశేషంగా తరలి రావాలని కోరారు.

ఆండాళ్ అమ్మవారికి విశేష పూజలు

నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఆండాళ్ అమ్మవారి తిరువాడిప్పూర ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా తిరుమంజనం, ప్రాకారోత్సవం, ఊంజల్‌సేవను వేడుకగా బుధవారం జరిపారు. ఉభయకర్తగా నరసింహరావు వ్యవహరించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసరావు, ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

ట్రాఫిక్‌పై దృష్టి సారించిన ఎస్పీ

సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(క్రైమ్): నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై ఎస్పీ కృష్ణకాంత్ దృష్టి సారించారు. సింహపురిలో ట్రాఫికర్ అనే శీర్షికన సాక్షిలో కథనం బుధవారం ప్రచురితమవ్వడంతో ఆయన స్పందించారు. నగరవాసులకు మెరుగైన ట్రాఫిక్‌ను అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నగరంలో ట్రాఫిక్ తీరుతెన్నులను ఏఎస్పీ క్రైమ్స్ ప్రసాద్ పరిశీలించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం తగదని సూచించారు.

ఘనంగా అభినందన సభ



నెల్లూరు (లీగల్): నెల్లూరు ఎనిమిదో అదనపు జిల్లా కోర్టు సీనియర్ సూపరింటెండెంట్ నర్సింహారావును ఆదర్శంగా తీసుకోవాలని 8వ అదనపు జిల్లా జడ్జి గీత పేర్కొన్నారు. ఉద్యోగ విరమణ పొందిన నర్సింహారావు, శరత్‌కుమార్‌రెడ్డికి అభినందన సభను జిల్లా కోర్టు భవన్‌లో న్యాయశాఖ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరిని సత్కరించారు. న్యాయశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ గోపీనాథ్‌రెడ్డి, రమణారెడ్డి, జిల్లా ప్రెసిడెంట్ సుధాకర్, న్యాయశాఖ జిల్లా అధ్యక్షుడు సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, నేతలు శివకుమార్, దీపక్, సురేంద్రబాబు, దినేష్‌కుమార్, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ కౌన్సిల్ సమావేశం



మాట్లాడుతున్న రాజశేఖర్

నెల్లూరు (టౌన్): రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజశేఖర్, వినోద్‌కుమార్ కోరారు. నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో బుధవారం నిర్వహించిన పీడీఎస్‌యూ జిల్లా కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. జీఓలు 84, 83, 117ను రద్దు చేసి ప్రాథమిక పాఠశాలలను కాపాడాలని కోరారు. సమావేశంలో కొన్ని తీర్మానాలు చేసి ఆమోదించారు. వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం 17 మందితో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సునీల్, ప్రధాన కార్యదర్శిగా షారూఖ్, ఉపాధ్యక్షులుగా శ్రావణ్, ప్రసాద్, సహాయ కార్యదర్శులుగా చరణ్, ఆసిర్, కోశాధికారిగా వశీం తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ



నెల్లూరు(అర్బన్): ద్విచక్రవాహనదారులు హెల్మెట్‌ను విధిగా ధరించాలని ఏసీఎస్సార్ ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ వసుంధరాదేవి పేర్కొన్నారు. హెల్మెట్‌ధారణ, రోడ్డు భద్రత నిబంధనలపై అవగాహన ర్యాలీని కమ్యూనిటీ మెడిసిన్, క్లినికల్, నాన్ క్లినికల్ విభాగాల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. మెడికల్ కళాశాల నుంచి సర్వజన ఆస్పత్రి, ఎమ్సీహెచ్ బ్లాక్ తదితర ప్రాంతాల్లో చేపట్టిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. రోడ్డు భద్రత నియమాలను పాటించాలని కోరారు. సర్వజన ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌నాయుడు, జనరల్ మెడిసిన్ విభాగ హెచ్‌ఓడీ నరేంద్ర, ఆర్థోపెడిక్ ప్రొఫెసర్ మస్తాన్‌బాషా, మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ గోవింద్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అధికారి కళారాణి తదితరులు పాల్గొన్నారు.

నూతన చట్టాలతో విచారణ వేగవంతం

నెల్లూరు(క్రైమ్): నూతన చట్టాల ద్వారా పోలీసుల విచారణ వేగవంతమవుతుందని సంతపేట ఇన్‌స్పెక్టర్ సుబ్బరాజు పేర్కొన్నారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్నెస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్నెస్సెస్), భారతీయ సాక్ష్య (బీఎస్) చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని స్టేషన్ ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ చట్టాల ద్వారా బాధితులకు సత్వర న్యాయం జరగడంతో పాటు నేరాలకు పాల్పడే వారికి శిక్షలు పడతాయని చెప్పారు. నూతన చట్టాల మేరకు దేశంలో ఎక్కడ నేరం జరిగినా, ఏ పోలీస్‌స్టేషన్లోనైనా బాధితులు ఫిర్యాదు చేయొచ్చని వివరించారు. పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరగకుండా జీరో ఎఫ్ఐఆర్ దోహదపడుతుందన్నారు.



అవగాహన కల్పిస్తున్న సుబ్బరాజు

మిత్రరత్న పురస్కారాల ప్రదానం



నెల్లూరు(బృందావనం): అంతర్జాతీయ స్నేహితుల దినోత్సవాన్ని నగరంలోని పురమందిరంలో సృజన సాహిత్య, సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు దగ్గుపాటి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా దశాబ్దాలుగా స్నేహబంధాన్ని సాగిస్తున్న మిత్రులను గుర్తించి వారికి మిత్రరత్న పురస్కారాలను ప్రదానం చేసి సత్కరించారు. రామ్మూర్తి, కోట గురుబ్రహ్మం, శివశంకర్, డాక్టర్ మారం సుధాకర్, ఐఎస్ రావు, సుస్వర రాజశేఖర్, విజయలక్ష్మి, పద్మావతి, నాగేశ్వరమ్మ, రూత్‌శైలను సన్మానించారు. కవితల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. దోస్త్‌బాషా బృందం ఆలపించిన గీతాలు అలరించాయి. ఆర్డీఓ మల్లోల, గుంటూరు నారీశక్తి ఫౌండేషన్ జాతీయ అధ్యక్షురాలు పొట్లూరి రమాదేవి, నలుబోలు బలరామయ్యనాయుడు, డాక్టర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.